పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కడెం

నాలుగేండ్ల ఏళ్ల క్రితం అమ్మ, నాన్నలు, రెండేళ్ల క్రితం అన్న చనిపోగా జీవితంపై విరక్తి చెంది యువకుడు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాసాయిపేట గ్రామానికి చెందిన గొట్టం రాకేష్(21) గత నెల 31న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రాకేష్‌ను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చిన తర్వాత శుక్రవారం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. నిర్మల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై భీంరావ్ తెలిపారు.



పీజీ ఎంట్రెన్స్‌లో సత్తా చాటిన ఆర్ట్స్ విద్యార్థులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి ముండే విఠల్ పీజీ ఎంట్రెన్స్ ఫలితాల్లో అత్యుత్తమ పదర్శన కనబర్చి కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో ఎంబీఏలో సీటు సాధించాడు. సీటు సాధించడమే కాకుండా ఏకంగా మూడు సబ్జెక్టుల్లో ర్యాంకులు సాధించాడు. అందులో భాగంగా రాష్ట్రస్థాయిలో హిందీలో రెండవ ర్యాంకును, ఎకనామిక్స్‌లో తొమ్మిదవ ర్యాంకు, హిస్టరీలో 108వ ర్యాంకు సాధించాడు. మరో విద్యార్థి ఇన్‌కేసర్ ఆలం ఎంఏ ఎకనామిక్స్‌లో 23వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ఈ విజయానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత నిరంతర ప్రోత్సాహమే కారణమన్నారు. హిందీ ఆధ్యాపకులు సంతోష్ కుమార్, ఎకనామిక్స్ అధ్యాపకులు కోటయ్య, స్వప్న, హిస్టరీ అధ్యాపకులు నందిని, పృథ్వీ కృషి కారణమని తెలిపారు.



సరైన ప్రోత్సాహం అందిస్తే సత్ఫలితాలు సాధించొచ్చు

- ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిన్నారులకు ఆసక్తి కలిగిన కళల్లో సరైన ప్రోత్సాహం అందిస్తే సత్ఫలితాలు సాధించవచ్చని, కళల్లో నైపుణ్యాలు మెరుగుపరుచుకునే దిశగా కృషి చేయాలని ఆదిలాబాద్ ట్రైనీ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవీయ సూచించారు. శనివారం పట్టణంలోని నవశక్తి దుర్గా పీఠం ఆవరణలో నిర్వహించిన మువ్వల సవ్వడి మహోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల కేంద్రం ఆధ్వర్యంలో మువ్వల సవ్వడి మహోత్సవం, గజ్జలు, తాంబూలం పూజ కార్యక్రమాలను నిర్వహించారు. నృత్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు, వారి తల్లితండ్రులు హాజరయ్యారు. ముందుగా కార్యక్రమ అతిథులకు సాదరంగా స్వాగతం పలికిన అనంతరం ప్రత్యేక పూజలు జరిపారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ గజ్జలు, తాంబూలం పూజ జరపగా చిన్నారులు భక్తి శ్రద్ధలతో పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చిన్నారులకు ఆసక్తి ఉన్న కలల్లో వారిని ప్రోత్సహించాలని ట్రైనీ కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో నాట్య గురువు మిట్టు రవి పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

- ఇద్దరు దొంగల అరెస్ట్



నవతెలంగాణ-కుభీర్

మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయంలో శనివారం చోరీ జరిగినట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన రాజన్నగౌడ్ శనివారం ఉదయం ఆలయానికెళ్లగా ఆలయం తలుపులు పగలగొట్టి ఉండడంతో లోనికెళ్లి చూశాడు. ఆలయ గుడి గంట, గ్యాస్ సిలిండర్ కనిపించలేదు. శుక్రవారం రాత్రి దొంగతనం జరిగినట్టు భావించి గ్రామస్తులు పోలీసులకు తెలిపారు. శనివారం పాంగ్రా గ్రామ శివారు ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కన్పించారు. టీవీఎస్ ఎక్సెల్(టిఎస్18డి7118)పై గుడి గంట, గ్యాస్ సిలిండర్ తీసుకెళ్తుండగా వెంబడించి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిని రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు.

యువకుడి అదృశ్యం.. కేసు నమోదు

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన తూము శ్రీకాంత్(27) అదృశ్యమైనట్లు ఎస్ఐ రవీందర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీకాంత్ తల్లిదండ్రులు గతంలోనే వివిధ కారణాలతో మృతి చెందారు. ఒక్కడే ఇంటి వద్ద ఉండేవాడు. గత శనివారం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన బావ చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో ఆచూకీ కోసం యత్నించినా జాడ లభించలేదు. దీంతో శనివారం ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్




టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్యాంక్ పోటీ పరీక్షల శిక్షణ తరగతులను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా టాస్క్ రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ తెలిపారు. ఆగస్టు 12 నుంచి టాస్క్ ఆధ్వర్యంలో బ్యాంకు సంబంధిత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటిని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టాస్క్ ద్వారా ప్రతి ఒక్కరూ టెక్నికల్ జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. టాస్క్‌లో ఈ శిక్షణలో కాకుండా అనేక కంప్యూటర్ సంబంధిత శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ నెంబర్ 9502786438కి కాల్ చేయాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం స్కానర్ ఉపయోగించుకోవాలని కోరారు.

ప్రాజెక్టులకు మోక్షం..సాగుకు యోగం..!

- అసంపూర్తి ప్రాజెక్టులపై ఆర్థిక మంత్రి భరోసా
- ఇప్పటికే కొన్నింటికి నిధులు..మరికొన్నింటికి హామీ
- ఉమ్మడి జిల్లా ప్రాజెక్టుల పూర్తికి సర్కారు దృష్టి
- పూర్తయితే సాగులోకి రానున్న లక్షల ఎకరాలు

ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర సర్కారు దృష్టి సారించింది. వివిధ నదులు, వాగులపై నిర్మించిన పలు ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉండగా.. వాటిని పూర్తి చేస్తామని భరోసానిచ్చింది. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పలు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించినట్లు పేర్కొనడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వీటితో పాటు కొత్తగా మరికొన్నింటినీ కూడా పూర్తిచేస్తామని భరోసా ఇవ్వడంతో పాటు పలు వాగులపై ఎత్తిపోథల పథకాలను నిర్మిస్తామని చెప్పడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమైంది. ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేందుకు ఆస్కారం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొన్ని ప్రాజెక్టులకు నిధులు విడుదల కాగా..మిగితా వాటికి సైతం నిధులు కేటాయించి పూర్తిచేస్తామని పేర్కొన్నారు. మరోపక్క ఉమ్మడి జిల్లావాసుల అకాంక్ష అయిన ప్రాణహిత ప్రాజెక్టు పనుల ప్రారంభంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



చిక్‌మాన్ ప్రాజెక్టు



కుమురం భీం ప్రాజెక్టు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో 80శాతం మంది రైతులు వర్షాధారం మీదనే ఆధారపడి పంటలు పండిస్తుంటారు. ఖరీఫ్‌లో అత్యధికంగా వర్షాధారమే సాగుకు కీలకం కాగా..రబీ సీజన్‌లో మాత్రం ఆయా సాగునీటి ప్రాజెక్టులే రైతులను కాపాడుతున్నాయి. ప్రాజెక్టులు ఉన్న ప్రాంతాల్లో వాటి ఆయకట్టు కింద రబీలో వేలాది ఎకరాల్లో పత్తితో పాటు పాటు వరి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలు సాగుచేస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో ఎల్లంపల్లి, సాత్నాల, మత్తడివాగు, స్వర్ణ వంటి ప్రాజెక్టుల ద్వారా వేలాది ఎకరాల్లో పంటలు సాగులోకి రాగా.. మిగితా కొన్ని ప్రాజెక్టుల ద్వారా మరికొన్ని ఎకరాలు తడుస్తున్నాయి. కానీ కొత్తగా నిర్మించిన కొన్ని ప్రాజెక్టులకు సంబంధించి పనులను అప్పటి ప్రభుత్వాలు అసంపూర్తిగా వదిలేయగా.. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం జరగలేదు. దీంతో ప్రాజెక్టులు ఉన్నా ఉపయోగం లేకుండా పోయింది. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లా సరిహద్దు గుండా ప్రవహిస్తున్న ప్రాణహిత నదిపై తొలుత ప్రాజెక్టు నిర్మించాలని యోచిస్తోంది. ఎన్నికల సమయంలోనూ ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రకటన చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తాజాగా ఆయా సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలపై దృష్టిపెట్టింది.

దాదాపు అన్నింటికీ నిధులు..!

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంగా అనేక హామీలు గుప్పించారు. గతంలో ఆయన సీఎల్పీ నేత హోదాలో ఉమ్మడి జిల్లాలోనే పాదయాత్ర ప్రారంభించారు. ఆ సమయంలో వివిధ ప్రాంతాల్లో పర్యటించిన సమయంలో ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. పలు ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయాలని చెప్పడంతో అనేక సమస్యలను ప్రస్తావించారు. వాటిని విన్న ఉప ముఖ్యమంత్రి తాజాగా వాటిని పూర్తిచేయాలని భావిస్తున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన సందర్భంలో ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని మీడియం, మైనర్ ప్రాజెక్టులను ప్రస్తావించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రాణహిత ప్రాజెక్టు పనులను నాలుగు నెలల్లో ప్రారంభిస్తామని, సదర్మాట్‌ను నెలలోనే పూర్తిచేస్తామని భరోసా ఇచ్చారు. వీటితో పాటు కుప్టి, చిక్‌మాన్, త్రివేణి సంగమం, పులిమడుగు, సుద్దవాగు, గొల్లవాగు తదితర వాటికి ఇప్పటికే నిధులు కేటాయించగా.. కుమురంభీం (అడ), చనక-కోర్టా ప్రాజెక్టుల కాల్వల నిర్మాణం చేపడుతామని భరోసా ఇచ్చారు. వీటితో పాటు పిప్పిరి, బుగ్గారం, తేజాపూర్ వద్ద ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరుచేశారు. ఇది వరకే నీల్వాయి, సదర్మాట్, మత్తడివాగు, పిప్రి ఎత్తి పోతల పథకాలకు నిధులు విడుదలయ్యాయి.

సాగులోకి మరిన్ని ఎకరాలు..!

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రస్తుతం 17.50లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నాయి. కొత్త ప్రాజెక్టులన్ని పూర్తయితే ఈ సంఖ్య మరింత అదనంగా పెరిగే అవకాశం ఉంటుంది. వర్షాధారం మీదనే కాకుండా..ప్రాజెక్టులు సైతం పంటలకు జీవనాధారంగా మారనున్నాయి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తుమ్మిడిహేటీ వద్ద ప్రారంభమైన ప్రాణహిత ప్రాజెక్టు పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిలిపివేసింది.ఇక్కడి ప్రాజెక్టును కాళేశ్వరం తరలించడంతో ఉమ్మడి జిల్లావాసులకు నిరాశ ఎదురైంది. తాజాగా మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ఆశలు చిగురించాయి. ఇది పూర్తయితే కుమురంభీం, మంచిర్యాల జిల్లాలో అదనంగా లక్ష ఎకరాలు సాగులోకి రానున్నాయి. కుమురంభీం, చనక- కోర్టా ప్రాజెక్టులకు కాల్వ నిర్మాణం చేపడితే మరో ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలోనూ వేలాది ఎకరాలు సాగులోకి రానున్నాయి.వీటితోపాటు కొత్తగా నిర్మించాల్సిన కుప్టి తదితర ప్రాజెక్టులతోనూ ఉమ్మడి జిల్లాలో అనేక ఎకరాలకు నీటి తడి లభించనుంది. అన్నదాతలకు ప్రయోజనం చేకూరనుంది.



వైఎస్.రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆవిష్కరించిన ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు శిలాఫలకం



పాణహిత-చేవేళ్ల ప్రాజెక్టు నిర్మాణ స్థలం

హక్కుల కోసం పోరాడుతున్న టీఎస్‌యూటీఎఫ్

- సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్
- ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని, వారి హక్కుల కోసం నిరంతరం ఉద్యమిస్తోందని సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనం వద్ద టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ ఉపాధ్యాయులను ఏకం చేస్తూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. 50 ఏళ్ల ప్రస్తానంలో విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. శాస్త్రీయ దృక్పథంతో విద్యా విధానం ఉండాలని పోరాటం చేస్తున్న ఏకైక సంఘం టీఎస్‌యూటీఎఫ్ అని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 31 వరకు వివిధ అంశాలపై సెమినార్లు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ యూటీఎఫ్ గొప్ప చరిత్ర గల సంఘమన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాడే సంఘమని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ సూత్రాలుగా పనిచేస్తూ హక్కులు బాధ్యతలు నేత్రాలుగా ముందుకు నడుస్తున్న సంఘం యూటీఎఫ్ అని అన్నారు. ముందుగా సీనియర్ నాయకులకు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు, కార్యకర్తలకు శ్రేయోభిలాషులందరికీ స్వర్ణోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మణరావు, కోశాధికారి కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, గణేష్, విలాస్, శివన్న, గౌస్‌మొహిద్దిన్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ శంకర్, మండల నాయకులు అశోక్, గంగాధర్, గణేష్ , రాజ్‌కుమార్, చిన్నయ్య, సంతోష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్ : ఆర్టీసీ ఆదిలాబాద్ డిపోలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్స్ ట్రైనింగ్ సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి కొత్త బ్యాచ్ ప్రారంభమవుతుందని డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హెవీ మోటార్ డ్రైవింగ్ నేర్చుకోవడానికి 7382840349 నెంబర్‌కు లేదా ఆదిలాబాద్ డిపో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఫీజు రూ.15,600 ఉంటుందని, అభ్యర్థులు తప్పనిసరిగా లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్, బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలని సూచించారు.

క్రీడలు ఉల్లాసానికి, ధృడత్వానికి దోహదపడతాయి

- జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి ఎంతగానో దోహదపడతాయని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావు అన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. శనివారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. నిత్యం విధుల్లో బిజీగా గడిపే న్యాయవాదులు, ఉద్యోగులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్‌రావుతో పాటు న్యాయమూర్తి శివరాంప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సరదాగా బ్యాటింగ్ చేసి అక్కడున్న వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపడుతున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. క్రీడోత్సవాలు నిర్వహిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రాల నగేష్‌తో పాటు పలువురు న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమయ పాలన పాటించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

డాక్టర్లు తమ సమయ పాలనను పాటించాలని డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ అన్నారు. శనివారం



మండలంలోని శ్యామ్‌పూర్ ఆస్పత్రిని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు సమయ పాలనను పాటించాలని క్రమం తప్పితే చర్యలు తప్పవని అన్నారు. అన్ని గ్రామాల్లో జ్వర సర్వే చేసి వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రోగులు ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన యువకులు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలో కాండ్లి నుంచి అర్లి, గొడిసెర వరకు వెళ్లే రోడ్డుపై అక్కడక్కడా గుంతలు ఏర్పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గమనించిన గొడిసెర గ్రామానికి చెందిన యువకులు మురళీ, రణధీర్ శనివారం గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాల వల్ల రోడ్డుపై నీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. దీంతో వాహనదారులు రాత్రుల్లో ప్రయాణించేటప్పుడు గుంతలు కనబడక పోవడంతో తరుచూ ప్రమాదాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ప్రయాణికులు వారిని అభినందించారు.



సీఐని కలిసిన యువజన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన నూతన సీఐ సునిల్ కుమార్‌ను యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందించి, శాలువాతో సత్కరించి అభినందించారు. పోలీసులకు యువత సహకారం ఎంతో అవసరమని, వారు పోలీసులకు అవినాభావ సంబంధంతో ఉంటూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకారం అందించాలని, యువజన కాంగ్రెస్ నాయకులను కోరారు. సీఐని కలిసిన వారిలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాకేష్, యువజన కాంగ్రెస్ నాయకుడు రంజిత్‌రెడ్డి ఉన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ ఎవరిని వరించేనో.. ?

- పదవీపై ఎవరి ధీమా వారిదే..!







నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ ఎవరికి వరించెనో..? అంటూ అందరి నోటా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 2023లో ఇక్కడి మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ కాలం ముగిసింది. దాని తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాగా, ఖానాపూర్ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్ విజయ ఢంకా మోగించారు. రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల కింద అన్ని నామినేట్ పదవులను భర్తీ చేయగా, దాంట్లో మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ ఒకటి. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ భర్తీ చేయాలంటే స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆశీస్సులు ఉండాలి. ఈ పదవీని అధిష్టించే నాయకుడు మండల పార్టీ క్యాడర్‌ను కలుపుకొవడంతో పాటు సీనియర్ నాయకుడు అయి ఉండాలి. అటువంటి నాయకుడి కోసం అధిష్టానం వెతుకుతోందని తెలుస్తోంది. ఇంద్రవెల్లి మార్కెట్ వాణిజ్య పరంగా పెద్దదిగా ఉండటంతో పాటు ఈ మార్కెట్‌కు ప్రతి ఏటా ఒక కోటికు పైగా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తుంది. దీంతో ఇక్కడ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీపై అనేక మంది ఆశావాహులు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ మార్కెట్ పరిధిలో ఇంద్రవెల్లితో పాటు నార్నూర్, గాదిగూడ తదితర మండలాలు వస్తాయి. ఆదివాసీ సామాజిక వర్గంలో గోండు తర్వాత ఇతర తెగలైన ఆంధ్, ప్రధాన్, తోటీ, కొలాం తదితర తెగలు సైతం మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవీ తమ తమ తెగలకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం అధిష్టానానికి తల నొప్పిగా మారింది. ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవికి ఐదు గురు అభ్యర్థులు నువ్వా నేనా అంటూ ఆశలు పెట్టుకొని ఎవరి ధీమా వారిదే అన్నట్టుగా ఆశలు పెట్టుకున్నారు. ఇటీవల ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మెన్ భర్తీకి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మిగతా మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవులు ఆగస్టు 15లోపు భర్తీ చేయనున్నట్టు సమాచారం. అయితే అధిష్టానం ఈ పదవిని ఎవరికి అలంకరిస్తారో వేచి చూడాల్సిందే..!

నిత్యావసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

ఆపదలో ఉన్నవారికి నిత్యావసర సరుకులు అందించి ఆదుకోవడమే గొప్ప పుణ్యమని ధరణి రాజేష్ అన్నారు. శనివారం మండలంలోని కొత్తగూడా గ్రామానికి చెందిన ప్రవీణ్ కుటుంబం దీనస్థితిలో ఉండటంతో బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ దృష్టికి రావడంతో మానవ దృక్పథంతో వెంటనే స్పందించి ప్రవీణ్‌తో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పి వెంటనే నెలకు సరిపడా నిత్యావసర సరుకులు పంపిణీ చేసి, మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కోల సత్తన్న గిరి సాజిద్, గురజాల సత్తన్న శివన్న సాయి, వర ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్ పాసుల పంపిణీ



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్‌లో శనివారం దివ్యాంగులకు బస్సు పాసులను ఆర్టీసీ సిబ్బంది పంపిణీ చేశారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆదేశానుసారం అర్హులైన 30 మందికి 50శాతం రాయితో కూడిన బస్ పాసులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది టివి.రమణ, పీఎస్. చారి, కంట్రోలర్ మోహినొద్దీన్, దివ్యాంగుల జిల్లా అధ్యక్షులు ఇసాక్ అలీ, ఖానాపూర్ అధ్యక్షులు రహీమ్, సాజీద్ పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

గుర్రాలతండా వాసికి కరాటేలో గోల్డ్ మెడల్



నవతెలంగాణ-బోథ్

మండలంలోని గుర్రాల తండా గ్రామానికి చెందిన గురుచంద సాహెబ్ జిన్నింగ్ మిల్లు యజమాని చవాన్ కైలాస్ సింగ్ కుమారుడు చవాన్ కౌశిక్ సింగ్ కరాటేలో గోల్డ్ మెడల్ దక్కిందని తెలిపారు. ఇటీవల శ్రీలంకలోని జరిగిన అంతర్జాతీయ కరాటే టోర్నమెంట్ నిర్వహించవచ్చన్నారు. ఆ పోటీలలో విజేతగా నిలిచి బంగారు పతకాన్ని సాధించారు. ఇలా విజేతగా నిలిచినందుకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

- ముధోల్ సీఐ మల్లేష్

నవతెలంగాణ-ముధోల్



ఆర్ఎంపీ, పీఎంపీలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముధోల్ సీఐ మల్లేష్ అన్నారు. ముధోల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆర్ఎంపీలు, పీఎంపీలకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేవలం ప్రాథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి వైద్యం అందిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో ప్రాథమిక వైద్యం పేరుతో బోర్డులు పెడుతూ ఎటువంటి అర్హత లేకుండా వైద్యం నిర్వహించకూడదన్నారు. లింగ నిర్ధారణ, మైనర్, మేజర్ మహిళలకు అబార్షన్, లాంటి చేయడం నేరమని అన్నారు. రోగులకు ఇంజక్షన్లు, మందులు ఇవ్వరాదని సూచించారు. మందులు ఇచ్చి వారి ప్రాణాల మీదకు తేవడం కూడా నేరమని పేర్కొన్నారు. రోగులకు ఇతర జిల్లాలోని ఎంబీబీఎస్ డాక్టర్లకు రెఫర్ లెటర్లతో వారికి ఇవ్వకూడదని, ప్రత్యక్షంగా రోగులను వేరే ఆస్పత్రికి తీసుకవెళ్లి బాదితుల నుంచి పరోక్షంగా కమీషన్‌లు తీసుకుంటున్నట్టు మా దృష్టికి వచ్చిందని చెప్పారు. రోగులు ఇష్టం వచ్చిన దగ్గర అనుమతి కలిగిన వైద్యుల వద్ద వారు వైద్యం పొందాలను కోరారు. నిబంధనలు పాటించని ఆర్ఎంపీ, పీఎంపీలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికిరణ్, పోలీస్ సిబ్బంది, ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

నూతన బోర్‌వెల్ ప్రారంభం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణంలోని పదో వార్డులో నూతనంగా తాగునీటి బోర్‌వెల్‌ను శనివారం మున్సిపల్ చైర్మెన్ రాజుర సత్యం పదో వార్డు కౌన్సిలర్ కురుమ శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్ పాషా, కొత్తపల్లి సురేష్, మేర మొగిలి, మేర నర్సయ్య, రహెమతుల్లా బాబా, భోగ లక్ష్మణ్, కడుకుంట నర్సిములు, ముత్తన్న, సత్యనారాయణ, కిరణ్, శ్రీనివాస్, జోగు రాజేశ్వర్, ప్రభాకర్‌రావు, నారాయణ, పుప్పాల శేఖర్, గణేష్, రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బాక్సింగ్ పోటీలు

- ప్రతిభ కనబర్చని ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇంటర్ డిస్ట్రిక్ బాక్సింగ్ పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. బీడీ మన్మోహన్ బాక్సింగ్ టోర్నమెంట్-2024 పేరుమీద జరిగిన ఈ పోటీల్లో అండర్-12, అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలు పాల్గొని తమ సత్తాను చాటారు. ఈ ఇంటర్ డిస్ట్రిక్ ఛాంపియన్‌షిప్‌లో ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన విద్యార్థులు పాలుపంచుకున్నారు. ముందుగా ట్రయల్ కేటగిరిలో విద్యార్థులు తమ బరువును సరిచూసుకున్నారు. అనంతరం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన బాక్సింగ్ కోచ్ సలావుద్దీన్ మాట్లాడుతూ బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదగాలని అన్నారు. తన ముగ్గురు కుమారులను సైతం బాక్సర్లుగా తీర్చిదిద్దానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎస్పీ మన్మోహన్, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

సినిమా తీసిన ఆదిలాబాద్ యువకుడు

- సంతోషాన్ని పంచుకున్న డైరెక్టర్ ఆకాష్‌రెడ్డి
- సినీ రంగాన్ని ప్రోత్సహించిన తల్లిదండ్రులు
- సక్సెస్ ఫుల్‌గా కొనసాగుతున్న అలనాటి రామచంద్రుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల విడుదలైన అలనాటి రామచంద్రుడు చిత్రానికి ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభిస్తోందని, థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శన కొనసాగుతోందని డైరెక్టర్ ఆకాష్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ నుంచి సినీ దర్శకుడిగా ఎదిగిన ఆయన దర్శకత్వంలో వచ్చిన అలనాటి రామచంద్రుడు చిత్రం ఆగస్టు 2న విడుదలైంది. శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సంతోషాన్ని పంచుకున్నారు. చిత్రం విజయవంతంగా ప్రదర్శితం అవుతుండటం పట్ల దర్శకుడి తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆకాష్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో అనేక మంది కళాకారులు ఉన్నారని, సరైన అవకాశాలు దక్కక వెలుగులోకి రావడంలేదని అన్నారు. కళాకారులను గుర్తించి ప్రోత్సాహం అందిస్తే తప్పకుండా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అటువంటి కళాకారులకు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సినిమా వెనుక ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరు తన స్నేహితుల సపోర్ట్‌తో పాటు నా తల్లిదండ్రులు చిలుకూరి సుభాష్ చంద్రారెడ్డి, ప్రణీతరెడ్డిల మద్దతు కూడా ఉందని పేర్కొన్నారు. సినిమాలో మొదటిసారి నటిస్తున్న హీరో, హీరోయిన్లు కూడా సినిమా సక్సెస్‌కు కారణమయ్యారని తెలిపారు. సినిమా తెలంగాణ ఏపీ రాష్ట్రాల్లో ప్రస్తుతం విజయవంతంగా కొనసాగుతుందని సీనియర్ మోస్ట్ పవర్ ఫుల్ డైరెక్టర్ దిల్‌రాజు సహకారంతో రెండు రాష్ట్రాల్లో సినిమాను విడుదల చేయడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా ఇంకా మంచి సినిమాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. ప్రస్తుతం అలనాటి రామచంద్రుడు సినిమాను ఆదరించి, విజయవంతంగా ముందుకు తీసుకు వెళుతున్న రెండు రాష్ట్రాల ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సినిమా తీయడం ఆదిలాబాద్ బిడ్డగా తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది తన మొదటి సినిమా అని పేర్కొన్నారు.

ఈ బియ్యం..తినేదెలా..?

- దుమ్ముధూళితో రేషన్ బియ్యం సరఫరా



నవతెలంగాణ- నేరడిగొండ

నిరుపేదలు కడుపునింపుతున్న రేషన్ బియ్యంలో నాణ్యత లోపిస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి దుమ్మూధూళితో సరఫరా అవుతోంది. దీంతో ఈ బియ్యాన్ని చౌకధరల దుకాణదారులు రేషన్ లబ్దిదారులకు అందిస్తున్నారు. దీంతో వాటిని తీసుకుంటున్న నేరడిగొండ గ్రామస్తులు ఈ బియ్యాన్ని తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మండల కేంద్రంలో ఒకటే చౌకధరల దుకాణం ఉండటంతో తరుచూ సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రతి నెలా 15తేదీలోపలే ఈ బియ్యం తీసుకోవాలనే నిబంధన విధించారని.. ఆ తేదీ తర్వాత వెళ్తే దుకాణం మూసి ఉంటుందని చెబుతున్నారు. మరోపక్క నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని, ఈ దుకాణానికి తోడు మరోకటి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో కంది

- కాలనీ అభివృద్ధిపై చర్చ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కైలాస్‌నగర్‌లో కాలనీవాసులంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శనివారం హనుమాన్ మందిర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అసెంబ్లీ కాంగ్రెస్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు పూల బొకేతో ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం కాలనీ వాసులతో కాలనీ అభివృద్ధిపై చర్చించారు. అందరితో సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యెల్మాల్వార్ అర్చన రామ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, లోక ప్రవీణ్‌రెడ్డి, గంగారెడ్డి, సల్ల విజయ్ బాబు, జనార్ధన్, కొండల్ రావు, బాబు రావు, మోహన్‌రావు, దత్త్రాత్రి, రామ్‌కిషన్ పలువురు ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలను బలోపేతం చేయాలి


- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యా సంస్థలను బలోపేతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలువురు నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అనేక సమస్యలతో విద్యార్థులు సతమతమవుతున్నారని, ముఖ్యంగా వర్షకాలంలో సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో, పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా కలెక్టరేట్ సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు లేక బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలు వసతిగృహాల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారని, వైద్య శిబిరాలు నిర్వహించడం లేదని ఆరోపించారు. అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడంలేదని, ఒకేదఫా విడుదల చేస్తామని, చెప్పి ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. మెస్ చార్జీలు పెంచడం లేదని, బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వెంటనే సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కోట్నక్ సక్కు, ఆదినాథ్, పవన్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఎస్సైకి సన్మానం




నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో పని చేసి బదిలీపై వెళుతున్న ఎస్సై రామును శనివారం బీజేపీ నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు బోరే రవీందర్, ప్రధాన కార్యదర్శి లాడేవార్ తుకారాం, నాయకులు సుభాష్, సూర్య, జక్కుల వెంకటేష్, కదం ప్రశాంత్, జుగాదిరావు, విజయ్, ఆకుల రాజేందర్, సగ్గం దాసు ,పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా యాకుబ్

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లాల్టెక్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా వి.యాకుబ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రతి ఒక విద్యార్థికి తన వంతుగా సహకారం ఉంటుందని అన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

కుమురంభీం ఆసిఫాబాద్

ఆదివారం | 11 ఆగస్టు, 2024 | www.navatelangana.com

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వేణుమాధవ్

నవతెలంగాణ-తిర్యాణి



మండల నూతన ఎస్ఐగా శనివారం వేణుమాధవ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన చుంచు రమేష్ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో సిర్పూర్ (యు)లో పనిచేస్తున్న వేణుమాధవ్ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి అవసరం వచ్చిన పోలీసులను సంప్రదించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రజలు సహకరించాలని కోరారు.

విద్యార్థులు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-దహెగాం



విద్యార్థులు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కందూరి రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు కళాజాత బృందం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, చదువుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలన్నారు. మంచిగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడాలని సూచించారు. అలాగే సమాజంలోని ఇతర పరిస్థితులపై కూడా పలు సూచనలను చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వానా, ఉపాధ్యాయులు, కళాజాత బృందం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్



నవతెలంగాణ-కెరమెరి

ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పొర్ల వెంకటేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన డీఎస్సీతో పాటు ఇతర పోటీ పరీక్షల నియామకాలు ఎస్సీ వర్గీకరణ ప్రకారం చేపట్టాలని డిమాండ్ చేశారు. గత నెల 18న ప్రారంభమైన వివిధ మాధ్యమాల్లో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు ఆగస్టు 5న ముగిశాయన్నారు. సుప్రీంకోర్టు ఆగస్టు 1న ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమైనదని, ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వెలువడించిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేయవద్దని కోరారు. విద్య, ఉద్యోగ అవకాశాల్లో ఎస్సీ ఉపకులాలకు సమన్యాయం జరగలంటే వర్గీకరణ అమలు చేశాకనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వర్గీకరణ వెంటనే అమలు చేయాలన్నారు. వర్గీకరణ విజయోత్సవ ర్యాలీ ఈనెల 13న చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని మాదిగ, మాదిగ ఉపకులాలు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వడ్లూరి సాగర్, ఆదర్శ్, కళ్యాణ్, వేణు పాల్గొన్నారు.

శివశంకర్ సేవలు ఎంతో విలువైనవి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మున్నూరు కాపులను ఐక్యం చేయడంలో మాజీ కేంద్రమంత్రి పుంజల శివ శంకర్ సేవలు ఎంతో విలువైనవని మున్నూరు కాపు సంఘం నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శివశంకర్ 95వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జీగా పని చేశారని, సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచి, అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ కేబినెట్‌లో రెండు సార్లు కేంద్రమంత్రిగా పని చేశారని తెలిపారు. అనంతరం కేరళ రాష్ట్రానికి గవర్నర్‌గా పనిచేసి ప్రజలకు సేవ చేశారన్నారు. బీసీ రిజర్వేషన్‌ల కోసం పోరాడిన వ్యక్తి అని గుర్తు చేశారు. మున్నూరు కాపులను ఐక్యం చేసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించి, సంఘం బలోపేతం కోసం కృషి చేశారని అన్నారు. వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు గడ్డల సురేష్, మణిగొండ వెంకటేశ్, అడప సతీష్, పోలంపల్లి గణపతి, గాజుల జక్కయ్య, గడ్డల శంకర్, మేకర్తి శ్రీనివాస్, గుర్రాల వెంకటేశ్వర్లు, మిట్ట పోశన్న, మరిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కబీర్


నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రానికి చెందిన ఆర్టీఐ యాక్టివిస్ట్, పాత్రికేయుడు మహమ్మద్ కబీర్ అహ్మద్‌ను సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ-2005 తెలంగాణ జనరల్ సెక్రెటరీగా నియమించినట్లు రాష్ట్ర డైరెక్టర్, మాజీ న్యాయమూర్తి ఎంఏ.సలీం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని సంవత్సరాల నుండి కబీర్ అహ్మద్ సేవ భావంతో వివిధ ఆర్గనైజేషన్ల నుం డి నీతి నిజాయితీ పాదర్శకతతో జవాబుదారీ తనంతో అవినీతి అక్రమాలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యలు పరిష్కరించడంతో పాటు సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించి, రైట్ టు ఇన్ఫర్‌మేషన్ యాక్ట్ ప్రొటెక్షన్ కమిటీ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీగా నియామించినట్లు ఆయన పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీలో బెల్లంపల్లి ఏరియాలోని ఇద్దరికి చోటు

నవతెలంగాణ-రెబ్బెన



తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) సెంట్రల్ కమిటీలో బెల్లంపల్లి ఏరియా నుండి మరో ఇద్దరికి చోటు లభించింది. ఖైరిగూడ ఓపెన్ కాస్ట్‌లో పనిచేస్తున్న గజెల్లి చంద్రశేఖర్ సీనియర్ మైనింగ్ సర్దార్‌కు సెంట్రల్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా మాంతు సమ్మయ్య, గోలేటి సీహెచ్‌పీలో పనిచేస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌కు సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చోటు లభించింది. తమకు సెంట్రల్ కమిటీలో అవకాశం లభించడానికి కృషి చేసిన టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావుకు, ప్రెసిడెంట్ మిర్యాల రాజిరెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్మిక హక్కుల రక్షణ కోసం కొత్త హక్కుల సాధన కోసం, ప్రస్తుతమున్న యూనియన్లు ఇచ్చిన హామీల అమలు కోసం కార్మికుల పక్షాన ఉండి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. సెంట్రల్ కమిటీలో చోటు రావడంతో తమ బాధ్యత మరింత పెరింగిందన్నారు.

శత శాతానికి విఘాతం..!

- జిల్లాలో మరుగుదొడ్ల నిర్మాణంలో అలసత్వం
- నాసిరకం పనులతో సగానికి పైగా నిరుపయోగం
- పురోగతి సాధించడంలో అధికారుల నిర్లక్ష్యం



మండలంలోని మోతుగూడలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బహిరంగ మలవిసర్జన రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే ఉద్దేశంతో 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాగానే 2019లో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఓడీఎఫ్ (బహిరంగ మలవిసర్జన రహితం) చేయాలని ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసింది. అధికారులు కాంట్రాక్టర్లు కుమ్మక్కై పథకాన్ని గాలికి వదిలేసి కాసుల దండుకున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సగానికి పైగా మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి.

జిల్లాలో ఇది పరిస్థితి

అధికారులు 2019లో జిల్లాలోని 15 మండలాల్లో ఉన్న గహాలలో 53,533 గృహాలకు మరుగుదొడ్లు లేవని గుర్తించి వాటిని నిర్మించడానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించారు. దీనికి గాను ప్రతి మరుగుదొడ్డికి మొదట్లో రూ.12,000 తర్వాత దానిని సవరిస్తూ రూ.15000లకు పెంచారు. అయితే ఆయా గ్రామ పంచాయతీల అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, నామమాత్రంగా పనులు పూర్తి చేశారు.

జిల్లాలో ఓడీఎఫ్ అధ్వానం

జిల్లాలోని 334 గ్రామపంచాయతీలో ఓడీఎఫ్ అప్పుడే వంద శాతం పూర్తి చేసిన అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. అనేక గ్రామపంచాయతీలో మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉండి బహిరంగ మలవిసర్జన ఇంకా కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం సఫలం కాకపోగా డబ్బు వృథా అయి గ్రామాల్లో అపరిశుభ్రత పెరుగుతుంది.

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగం

గ్రామపంచాయతీ సెక్రటరీలకు మరుగుదొడ్ల నిర్మాణం లక్ష్యంగా ఇవ్వడంతో వేగంగా పూర్తి చేసి నామమాత్రంగా పనులు చేశారు. అవి ప్రస్తుతం 50 శాతం పైగా నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై అధికారులు, ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

100శాతం సాధించినట్లు అవార్డు సొంతం

2019 డిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో నేషనల్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో 100 శాతం ఓడీఎఫ్ సాధించినట్లు జిల్లా అధికారులు అవార్డు తీసుకున్నారు. అయితే తర్వాత దాని నిర్వహణ చేయాల్సిన గ్రామస్థాయి అధికారులు కనీసం పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా తయారయింది.



హైదరాబాద్‌లో అవార్డు తీసుకుంటున్న అధికారులు(ఫైల్)

తాత్కాలిక ప్రయోజనమే..శాశ్వత పరిష్కారమేదీ..?

- 17 రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు
- పరిష్కారం చూపని అధికారులు

రెక్కాడితే కాని డొక్కాడని కార్మికులు వారు. అసలే చిన్న జీతాలు. ఆ జీతాలు కూడా సక్రమంగా ఇవ్వలేని పరిస్థితి మున్సిపాలిటీది. దీనితో ఆ కార్మికులు అన్నమో రామచంద్రా అంటూ భిక్షాటనకు కూడా దిగాల్సి వస్తోంది. కార్మికులు ఆందోళనకు దిగిన సమయంలోనే అధికారులు, పాలకవర్గం తూతూ మంత్రంగా ఒకటి లేదా రెండు నెలల జీతాలు చెల్లించి తాత్కాలికంగా సమస్యను పరిష్కరిస్తున్నారే తప్ప దీనికి శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇది కాగజ్‌నగర్ మున్సిపాలిటీ కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికుల దుస్థితి.



వేతనాల కోసం రాస్తారోకో చేస్తున్న మున్సిపల్ కార్మికులు (ఫైల్)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 175 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి ప్రతి నెల రూ. 16,600 వేతనాలు చెల్లిస్తున్నారు. ఇవి నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో ఆ కార్మిక కుటుంబాల పోషణ కష్టసాధ్యంగా మారుతోంది. కొన్ని సందర్భాలలో ఆరు నెలల వరకు కూడా వేతనాలు చెల్లించడం లేదు. పండగ వచ్చిందంటే చాలు కార్మికులు ఆందోళన చేస్తేనే వేతనాలు చెల్లిస్తున్నారు. పండుగల సమయంలో మా కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయంటూ కార్మికులు కార్యాలయం ముందు ధర్నా లేదా సమ్మెలు చేస్తున్నారు. దీంతో అధికారులు నామమాత్రంగా ఒకటి లేదా రెండు నెలల వేతనాలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నారు.

ప్రస్తుతం 17 రోజులుగా సమ్మె



వేతనాలు ఇవ్వకపోవడంతో పట్టణంలో భిక్షాటనకు దిగిన కార్మికులు (ఫైల్)

ప్రస్తుతం కార్మికులు 17 రోజులుగా సమ్మె చేపడుతున్నారు. దీనితో పట్టణంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది. కేవలం 11 మంది కార్మికులు, ఏడుగురు ఎస్ఎంఆర్ కార్మికులు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని కూడా సోమవారం నుండి పనిలోకి అనుమతించబోమని మిగిలిన కార్మికులు స్పష్టం చేస్తున్నారు. మంచినీటి సరఫరా విభాగంలో పని చేసే కార్మికులు, కార్యాలయంలో పని చేసే సిబ్బందిని కూడా అడ్డుకుంటామని సమ్మెలో పాల్గొంటున్న కార్మికులు తెలిపారు. ఇదే జరిగితే పట్టణవాసులకు మంచినీటి సరఫరా ఉండక సమస్య తీవ్రమయ్యే పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు నాలుగు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉండగా, ఎస్ఎంఆర్ కార్మికులకు ఆరు నెలల వేతనాలను చెల్లించాల్సి ఉంది.

2016 నుండి ఈఎస్ఐ, పీఎఫ్ పెండింగ్

కార్మికులకు చెల్లించే వేతనాలలో నుండి ప్రతి నెలా ఈఎస్ఐ, పీఎఫ్ పేరిట అధికారులు కోత విధిస్తున్నారు. కాని కోత విధించిన మొత్తాన్ని ఆయా ఖాతాలలో జమ చేయడం లేదు. ప్రతి కార్మికునికి నెల నెలా రూ.16,600 జీతం చెల్లించాలి. ఇందులో నుండి ఈఎస్ఐ, పీఎఫ్ పేరిట రూ. 2000 కోత విధిస్తున్నారు. కోత విధించిన మొత్తాన్ని అధికారులు వెంటనే ఈఎస్ఐ, పీఎఫ్ ఖాతాలలో జమ చేయాలి. దీనికి మున్సిపాలిటీ కూడా కొంత మొత్తం కలపాల్సి ఉంటుంది. కోత విధించిన మొత్తం నుండి 12 శాతాన్ని ఈఎస్ఐ, 1.75 శాతాన్ని మున్సిపాలిటీ పీఎఫ్‌కు జమ చేయాల్సి ఉంటుంది. మున్సిపల్ వాటా పక్కన పెడితే కార్మికుల నుండి కోత విధించిన మొత్తాన్నే అధికారులు జమ చేయకపోవడం కార్మికులను ఆందోళనకు గురి చేస్తోంది.

గిరిజన గ్రామానికి మట్టి రోడ్డు సౌకర్యం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం చిన్న మాలిని గిరిజన గ్రామానికి ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు కోతకు గురైంది. గ్రామ సమీపంలో వాగుపై ఉన్న బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. దీనితో చిన్న మాలిని, మానిక్‌పటార్ గ్రామాలకు సిర్పూరు (టి) మండలకేంద్రంతో పూర్తిగా సంబంధాలు తెగిపోయాయి. విషయం తెలుసుకున్న సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు తన పార్టీ నాయకులు, కార్యకర్తలను ఆ గ్రామానికి పంపించి రోడ్డు మరమ్మత్తులు చేయించాలని సూచించారు. దీనితో నాయకులు పాల్వాయి సుధాకర్‌రావు, నీరటి సత్యనారాయణ, అశోక్ ఆర్య, ఒడ్డేటి నాని, బనార్కర్ సాయి, దుర్గం ప్రశాంత్, నైతం అనిల్‌కుమార్‌లు అక్కడికి వెళ్లి జేసీబీ సహాయంతో అప్రోచ్‌రోడ్డు ఏర్పాటు చేశారు. దీనితో ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మత్తులు చేసిన తర్వాత దారి



వర్షానికి కోతకు గురైన దారి (మరమ్మత్తుకు ముందు)

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావ్
- ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం చేయడమే తమ లక్ష్యమని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు అన్నారు. జిల్లా కేంద్రంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించినంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 50 సంవత్సరాల క్రితం 1974లో ప్రారంభించిన తమ సంఘం ఉపాధ్యాయ సమస్యలపై ఎన్నో విజయాలు సాధించిందని గుర్తు చేశారు. అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృఅనే మూడు సూత్రాలపై ఏర్పడ్డ తమ సంఘం ఎప్పటికప్పుడు సమకాలిన అంశాలను అధ్యయనం చేస్తూ సామాజిక సేవలో పాల్గొంటున్నట్లు వివరించారు. కుటుంబ సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి చనిపోయిన కుటుంబ సభ్యులకు రూ.6 లక్ష చెల్లిస్తున్నట్లుతెలిపారు. ఉపాధ్యాయుల సహకారంతో భవిష్యత్తులో వారి సమస్యలపై పోరాటం చేస్తామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, కోశాధికారి తంగడిపల్లి రమేష్, కాంపెల్లి ఉషన్న, కోట తిరుపతి, రాపర్తి నవీన్ కుమార్ పాల్గొన్నారు.

అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి

- బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ప్రణయ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనీ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు ఆవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఉన్నత విద్య విషయంలో చాలా వెనుకబడి ఉందన్నారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పై చదువులకి ఏ ఒక్క ఉన్నత విద్యాసంస్థ కూడా లేదని తెలిపారు. జిల్లాలో చాలా వరకు వ్యవసాయంపై ఆధారపడే కుటుంబాలే ఉన్నాయన్నారు. వీరంతా వ్యవసాయంపై ఆసక్తి చూపిస్తున్నారని దీంతో వ్యవసాయ విద్య అందుబాటులో ఉంటే ఎక్కువ మందికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన ఉన్నందున జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉంటే వ్యవసాయంలో సాంకేతిక అధునాతన పద్ధతులను నేర్చుకుంటే రైతులకు కొంత మేలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు యూనివర్సిటీ ఏర్పాటుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు బోర్కూటే ప్రదీప్, కార్తీక్, సందీప్, ఉదయ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

పోలీస్ స్టేషన్‌లో రెండు సంవత్సరాల నుండి పనిచేసిన సీఐ శ్రీనివాస్ బదిలీపై కరీంనగర్‌కు వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ఐ సాగర్, కెరమెరి ఎస్ఐ విజయ్ ఆయనకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ రెండు సంవత్సరాల నుండి చేసిన సేవలను కొనియాడారు. అందరితో కలిసిమెలిసి ఉన్నారని, ఇకపై అక్కడ కూడా మంచి బాధ్యతలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సీఐగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ



వాంకిడి సీఐగా సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన శ్రీనివాస్ కరీంనగర్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో ఐజీపీ కార్యాలయానికి అచ్‌గా ఉన్న సత్యనారాయణను వాంకిడి సీఐగా బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు.

వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ మాజీ లిసర్పంచ్ కోలే శ్యాంరావ్ జన్మదినాన్ని గోలేటిలోని వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో ఉన్న వారికి పండ్లు, బ్రెడ్స్, బిస్కెట్స్‌ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వడై అరుణ్ కుమార్, ఇగురపు సంజీవ్, నగోశా విలాస్, ఓరగంటి రంజిత్, కొట్రాంగి రాజశేఖర్ పాల్గొన్నారు.

కైరిగూడ వద్ద కనిపించిన పులి..?

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గత మంగళవారం నుండి ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న పులి ఎర్రగుట్ట వద్ద బుధవారం ఆవును చంపగా గురువారం రాత్రి అడ సమీపంలో కనిపించిందని కొందరు చెప్పారు. దీంతో అధికారులు కలియతిరిగారు. అయినప్పటికీ పులిజాడ కనిపించలేదు. తాజాగా శనివారం రాత్రి ఖైర్‌గూడ ఓపెన్ కాస్ట్ గనుల వద్ద సింగరేణి సెక్యూరిటీ గార్డుకు కనిపించడంతో భయానికి గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది. ఇదే విషయం తిర్యాణి అటవీ రేంజ్ అధికారి శ్రీనివాస్‌ను సంప్రదించగా తమకు కూడా సమాచారం అందిందని సిబ్బందిని పులి సంచరించే ప్రాంతానికి పంపించినట్లు తెలిపారు. ఏది ఏమైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రాత్రిపూట తిరగకూడదని సూచించారు. పులి ఆ ప్రాంతంలో సంచరిస్తుందా లేదా అనే విషయం ఆదివారం ఉదయం వరకు తెలుస్తుందని తెలిపారు.

రూరల్‌లో ఆధార్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను తహసీల్దార్ సాయి మహేష్ పునఃప్రారంభించారు. ఇటీవల మావల తహసీల్దార్ ఆఫీస్ నుండి ఆదిలాబాద్ రూరల్ ఆఫీస్‌కి మార్చబడ్డ ఆధార్‌సెంటర్‌ను ఈడీఎం బండి రవితో కలిసి శనివారం ప్రారంభించారు. ప్రజలు ఆధార సర్వీస్‌ను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొండ విశాల్, ఆధార్ ఆపరేటర్ శేషగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

జన్నారంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ కిష్టాపూర్ గ్రామపంచాయతీలలో కలెక్టర్ కుమార్ దీపక్ అకస్మికంగా పర్యటించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డ్ స్మశాన వాటికలు నర్సరీలలో పర్యటించి వాటిని పరిశీలించారు. ముందుగా రెండ్లగూడ డంపింగ్ యార్డ్ స్మశాన వాటికలలో మొక్కలు నాటారు. సిగ్రిగేషన్ షెడ్ లో వర్మి కంపోస్ట్ తయారవుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నర్సరీలలో ఉన్న మొక్కలను ప్రజలకు పంచి కాళీ ప్రదేశాల్లో నాటించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ మాజీ సర్పంచ్ నెమలికొండ ఆశరాజ్ గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ కే శ్రీకాంత్, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఏపీఎం బుచ్చన్న పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో యూనియన్ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథిలుగా పాల్గొన్న టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వైద్య శాంతి కుమారి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న ఆవిర్భవించిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రెండు తెలుగు రాష్ట్రాల్లో స్వర్ణోత్సవాలు జరుపుకుంటుందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమాన్ని శిఖరాగ్రాన నిలిపి ఐక్య ఉద్యమాలు నిర్మించి, ప్రముఖ విద్యావేత్తలు చుక్కారామయ్య, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, లక్ష్మణ్ రావు, బాలసుబ్రమణ్యం లాంటి 9 మందిని ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీలుగా గెలిపించుకున్నమన్నారు. విద్యారంగ బాగు కోసం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నమని తెలంగాణ రాష్ట్రంలో విద్యాయాత్ర నిర్వహించి ప్రాథమిక పాఠశాలలను క్లాసు కొక టీచర్, క్లాస్ కొక గది ఉండేటట్టుగా అభివృద్ధి చేసి, ఇంగ్లీష్ మీడియం ప్రారంభించాలని డిమాండ్ చేశామన్నారు. ఫలితంగా ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రారంభించిందని, కోవిడ్ సమయంలో వలస కార్మికులకు ఉపాధ్యాయుల ద్వారా మంచిర్యాల జిల్లాలో రూ.3 లక్షల విరాళాలు సేకరించి నిత్యవసర సరుకులు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. లాక్ డౌన్ సమయంలో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని తల్లిదండ్రులను సంప్రదించి సర్వే నిర్వహించి ఆన్లైన్ క్లాసులు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి ఆన్లైన్ క్లాసులను ప్రారంభించడానికి కృషి చేసిందన్నారు. పండిత, పీఈటి పోస్టుల అప్గ్రేడేషన్ సాధించి, 2010 కన్నా ముందు అపాయింట్ అయిన ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇప్పించి 2023- 24 లో 25వేల ప్రమోషన్లు సాధించడం, తెలంగాణలో మొదటి పీఆర్సీ 30 శాతం ఫిట్మెంట్ సాధించడం, సీపీఎస్ రద్దు కోసం చేసిన నిరంతర పోరాట ఫలితంగా డెత్ గ్రాటిటి సాధించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, విద్యారంగానికి మరింత నిధులు పెంచి అన్ని పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 5 డీఏలు వెంటనే ప్రకటించాలని, పీఆర్సీ నివేదికను బహిర్గతపరిచి 30 శాతం ఫిట్మెంట్తో పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజావేణు, రాష్ట్ర కమిటీ సభ్యుడు గొల్ల రామన్న, జిల్లా ఉపాధ్యక్షులు జి నర్సయ్య, ఎస్ లావణ్య, జిల్లా కోశాధికారి బి కిరణ్, జిల్లా కార్యదర్సులు కె చంద్రమౌళి, వి కిరణ్ కుమార్, జె బాపు, బి దేవదాస్, యు తిరుపతి, జి సంపత్, డి. చక్రవర్తి, ఆర్ తులసిపతి, ఎం కాంతారావు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ఎస్సీల అభివృద్ధికి తన వంతుగా కృషి చేయాలని కాంగ్రెస్ రూరల్ మండల అధ్యక్షుడు పుండ్రు నర్సింగ్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను షాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద ఎస్సీ యువత ఆర్థికాభివృద్ధి సాదించేవిదంగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా త్వరలోనే స్వయం ఉపాధి రాయితీ రుణాలు ఇప్పించేదుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బండారి అశోక్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో కుమురంభీం విగ్రహానికి పాలాభిషేకం



నవతెలంగాణ-కాసిపేట

బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఘనంగా కుమురంభీం విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. శనివారం బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ అధ్యక్షతన హర్ ఘూర్ తిరంగా నిర్వహించి దేశ స్వతంత్రం కోసం కృషి చేసిన సమర యోధులు స్మరిస్తూ కాసిపేట మండలం కొండాపూర్ యాపలో యువ మోర్చా అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో కుమురంభీం విగ్రహాన్ని శుద్ధి చేసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్ మాట్లాడుతూ హర్ ఘూర్ తిరంగా కార్యక్రమంపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్న, బాలరాజ్, మండల ఉపాధ్యక్షుడు కిరణ్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు వినయ్, బీజేవైఎం నాయకులు చొప్పదండి విష్ణువర్ధన్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శులు వి శ్రీనివాస్, మురళి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, అంజి, నాయకులు శ్యామ్ పాల్గొన్నారు.

ఎస్‌జీటీ పోస్టులు భర్తీ చేయాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్‌జీటీ పోస్టులను భర్తీ చేయాలని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు, ఆడె ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని నారాయణపేట, వికారాబాద్ జిల్లాలలో ఎస్‌జీటీ పోస్టుల ఖాళీలు అధికంగా ఉండగా, ప్రభుత్వ అనుమతితో ఆయా జిల్లాలలో ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను జిల్లా విద్యాశాఖాధికారులు నియమిస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా మన జిల్లాలో కూడా 500 ఎస్‌జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నందున ప్రభుత్వ అనుమతి తీసుకొని ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్స్‌ను నియమించాలని వారు కోరారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య అధికంగా ఉన్నందున ఈ పోస్టుల భర్తీకి కృషి చేయాలన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన అధికారులకు సన్మానం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాకు ఉద్యోగొన్నతిపై ఎస్ఓ టూ జీఎంగా వచ్చిన సత్యనారాయణను సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ గతంలో శ్రీరాంపూర్ డివిజన్‌లో పనిచేసి తిరిగి ప్రమోషన్‌పై శ్రీరాంపూర్ ఎస్ఓ టూ జీఎంగా రావడం చాలా సంతోషమని, భవిష్యత్తులో కూడా వారు మరిన్ని పదవులు అవరోధించాలని ఈ సందర్భంగా వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శిలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్ రావు, ఫిట్ కార్యదర్శిలు మురళి చౌదరి, దాడి రాజయ్య, గొల్లపల్లి రామచందర్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, నాయకులు మల్లేష్, ఆత్మకూరి రవి పాల్గొన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఉపరితల గనిలో ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగొన్నతిపై జనరల్ మేనేజర్‌గా బెల్లంపల్లి ఏరియాకు వెళుతున్న సందర్భంగా ఎం శ్రీనివాస్‌ను ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం సత్యనారాయణ, ఎస్ఆర్పీ-1, 3 గ్రూప్ గోపాల్ సింగ్, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, ఆర్కె-7 ఏజెంట్ రాముడు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, డీజీఎం ఏరియా స్టోర్ యాదయ్య, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సీహెచ్‌పీ ఇన్‌చార్జి చంద్ర లింగం, సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, ఇన్‌చార్జి డివిజన్ సివిల్ బి రాము, పర్చేజ్ అధికారి చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాన్ గౌడ్, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి పాల్గొన్నారు.

స్వయం ఉపాధి దిశగా సాగాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కంప్యూటర్ శిక్షణ పొందిన యువతులు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని, తమ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవాలని మైనార్టీ నాయకులు, ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ యూనిస్ అక్బానీ అన్నారు. శనివారం పట్టణంలో ఆదిలాబాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ పూర్తయినవారికి సర్టిఫికెట్ల అందించారు. ఈ కార్యక్రమానికి హాజరై మహిళలు, యువతులకు సర్టిఫికెట్లను అందజేశారు. అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని, మంచిస్థాయికి ఎదగాలని అతిథులు ఆకాంక్షించారు. మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలన్న లక్ష్యంతో ట్రస్ట్ ద్వార ఉచిత మగ్గం, టైలరింగ్ శిక్షణ అందించినట్లు తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేరెంట్స్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

2024-25 విద్యా సంవత్సరానికి లక్షెట్టిపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో పేరెంట్స్ కమిటీని ఎన్నుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమా కళ్యాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండవ శనివారం సందర్భంగా కళాశాలకు వచ్చిన తల్లిదండ్రులందరూ సమావేశమై ప్రిన్సిపాల్ సమక్షంలో ప్రజాస్వామ్యబద్ధంగా తల్లిదండ్రుల కమిటీని ఎంపిక చేసుకున్నారని తెలిపారు. అధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా ఏ సరిత, ప్రధాన కార్యదర్శిగా ఎం మాణిక్యం, సహాయ కార్యదర్శిగా మురళీ, సంయుక్త కార్యదర్శిగా పి వీరాస్వామి, కోశాధికారిగా సుజాత ఎన్నికయ్యారు. సహాదారులుగా మహేందర్, ఎస్ గజానంద్, ఎల్ తిరుపతి, లింగయ్య పి తిరుపతి, డి చంద్రయ్య పలువురిని ఎన్నుకున్నారు.

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గంజాయి అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొని అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని సుందరయ్య నగర్‌కు చెందిన ఉస్మాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు పేర్కొన్నారు. పంజాబ్ చౌక్‌లో గంజాయి అమ్ముతున్నట్టు అందిన సమాచారం మేరకు శనివారం అతనిని తనిఖీ చేయగా 920 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవెని శంకర్



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తే ప్రజల తరపున ఎంతటి పోరాటాలకైనా న సిద్ధంగా ఉన్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవెని శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన సీపీఐ జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లడారు. కాంగ్రెస్‌పై ప్రజలు విశ్వాసంతో గెలిపించారని ఆ విశ్వసాన్ని నిలబెట్టుకొని కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రైతు రుణ మాఫీలో రైతుల అయోమయానికి గురికాకుండా చూడాలని కోరారు. రైతు రుణ మాఫీ పై పూర్తిగా ప్రభుత్వానికే స్పష్టత లేకుండా పోయిందని అన్నారు. రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్‌లు, వెంటనే ఇవ్వాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కేంద్రం ఆఫీస్ కార్యదర్శి ధూళిపాళ్ల రామచందర్‌రావు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య, కేరళ రాష్ట్రంలో వరద విపత్తులో మరణించిన ప్రజలకు సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సంతాపం ప్రకటించి మౌనం పాటించారు. అంతకు ముందు పార్టీ జెండాను సీనియర్ నాయకుడు చిప్ప నర్సయ్య ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు, నిర్మాణ కౌన్సిల్ సమావేశం జిల్లా సమితి సభ్యురాలు రేగుంట చేంద్రకళ, బొంతల లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామడుగు లక్ష్మణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, మిట్టపల్లి వెంకట స్వామి, బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, రేగుంట చేంద్రశేఖర్, కారుకూరి నగేష్, వీరభద్రయ్య, ధాగం మల్లేష్, లింగం రవి, మిట్టపల్లి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అలనాటి రామచంద్రుడు మూవీ డైరెక్టర్ ఆకాష్ రెడ్డిని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయగా సంఘం నాయకులు పాల్గొని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోపిడి రాంరెడ్డి, నాయకులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య రైతు బిడ్డగా ఏంతో కష్టపడి ఎదిగి కేవలం రెండు షార్ట్ ఫిలిమ్స్ తీసి ఏకంగా టాలీవుడ్ డైరక్టర్‌గా ఎదగడం రెడ్డి కులస్తులకే కాకుండా మన జిల్లాకే గర్వకారణమన్నారు. మరిన్ని మంచి సినిమాలు తీసి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

జ్వరంతో మహిళ మృతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని స్టేషన్ పెద్దనపల్లికి చెంది ముక్కెర రోషిణి(24) మృతి చెందినట్లు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని స్టేషన్ పెద్దనపల్లిలో ముక్కర రోషిని తన భర్త వెంకటేష్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. అప్పుడప్పుడు భార్య భర్తల మధ్య గొడవలు జరిగితే పెద్ద మనుషుల సమక్షంలో భార్యాభర్తలు ఇద్దరు కూడా మంచిగా ఉండాలని పలు మార్లు పంచాయతీలు జరిగాయి. గురువారం నుంచి జ్వరం రాగా శుక్రవారం ఆమె భర్త ఆమెని బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ ఫిట్స్ రావడంతో మెరుగైన చికిత్స కొరకు రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఏరియా హాస్పిటల్‌కి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. తన కుమార్తె ముక్కెర రోషిని మృతిపై అనుమానం ఉందని రోహిణి తండ్రి పిట్టల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.



శివ శంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం



నవతెలంగాణ-జన్నారం

మాజీ కేంద్రమంత్రి శివశంకర్ ఆశయ సాధనకు కృషి చేద్దామని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షులు లెక్కల మల్లయ్య అన్నారు. శివ శంకర్ 95వ జయంతిని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళులర్పించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ కులస్తులకు చట్టపరంగా రిజర్వేషన్లు పెంచేలా మాజీ కేంద్రమంత్రి శివశంకర్ కృషి చేశారని, శివశంకర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. 1953 నుండి బీసీ రిజర్వేషన్ల విషయంలో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డితో తలపడీ లక్షెట్టిపేట నియోజకవర్గం శాసనసభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి జేవీ నర్సింగరావు సహకారంతో రిజర్వేషన్లు సాధించడం శివశంకర్‌కే సాధ్యమైంది అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య. కోకన్వీనర్ కడార్ల నరసయ్య, మంచిర్యాల జిల్లా బీసీ కేయూపీఎస్ కన్వీనర్ ఆడెపు లక్ష్మీనారాయణ, కోకన్వీనర్ బాలసాని శ్రీనివాస్‌గౌడ్, జన్నారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, జన్నారం మండల మాజీ ఎంపీపీ చెట్పల్లి సత్యం, కోకన్వీనర్ మామిడి విజయ్ , బీసీ యువ నాయకుడు దాసరి శ్రీనివాస్, ఒల్లాల నర్సగౌడ్, కొండపల్లి మహేష్ పాల్గొన్నారు.

నేడు ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎస్సీ స్టడీ సర్కిల్లో సివిల్స్, ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల కోసం ఈనెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్‌లలో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభ్యర్థులు టీఎస్‌స్టడిసర్కిల్.కో. ఇన్ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని పరీక్ష కేంద్రానికి 30 నిమిషాలు ముందుగానే చేరుకోవాలని సూచించారు.